పెడుతుంటే నా హృదయం విల విల లాడింది. తెలివిలేకుండా మూసుకున్న కళ్ళకింద పొడుగాటి కనురెప్పలు విసనకర్రలా పరుచుకున్నాయి. అసలే గులాబిరంగులో వుండే చెక్కిళ్ళు జ్వర తీవ్రతకి ముదరు గులాబిరంగు దాల్చాయి. ఆ కోమలమైన చేయి చేతిలోకి తీసుకోగానే వణికాను. ఆ పొడుగాటి వేళ్ళు-అందంగా కత్తిరించిన ఆ గోళ్ళు-మెత్తని పువ్వులాంటి చెయ్యి అవసరానికి మించి ఎక్కువసేపే పట్టుకున్నాను. మొత్తానికి రజియా కంటపడిన క్షణంనించి నాలో ఏదో సంచలనం బయలుదేరింది.

ఆపరేషను అయి, రజియాకి పూర్తి స్పృహ వచ్చేసరికి తెల్లవారింది. ప్రత్యేక శ్రద్ధతో ప్రతి అరగంటకి వెళ్ళి రజియాని చూస్తూంటేవాడిని అంత సేపు. మెళకువ వచ్చాక ఎదురుగా కన్పించిన నన్ను చూసి రజియా అంత బాధలోనూ చకితురాలై పోయింది. అసలే పెద్దవయిన ఆ కళ్ళు మరింత విప్పారాయి పాలి పోయిన ఆ బుగ్గలు గులాబి రంగు దాల్చాయి. ఏమి అర్థం కానట్టు అయోమయంగా నా వంక- చూట్టూ చూసింది. 'ఎక్కడ వున్నాను - నే నెక్కడ వున్నాను' అంటూ గొణిగింది. ఆపరేషన్ కాగానే ఆమె స్నేహితురాళ్ళిద్దరూ రూముకి వెళ్ళి వస్తాం అని వెళ్ళారు. జరిగినది ఏది ఆమెకి గుర్తులేదని స్పష్టపడింది. 'మీరు .... మీ రెవరు. నేను .... నేను-' అంటూ గాభరాగా చుట్టూచూసింది. ఆరాటంగా లేవ బోయింది. చటుక్కునముందుకు వంగి ఆమె బుజాలు రెండు పట్టుకుని పడుకో బెట్టాను. 'ఆ... ఆ లేవకండి.... లేవకూడదు మీరు అన్నాను. పక్కన వున్న నర్సు వచ్చి ఆమెని సరిగా పడుకోబెట్టి దుప్పటి కప్పింది. భయంగా చూసింది రజియా-' మరేం భయంలేదు మీకు అపెండిసైటిస్ ఆపరేషన్ జరిగింది. అంతే - ఇప్పుడింకేం భయంలేదు. మీకేంపరవాలేదు నిశ్చింతగా పడుకోండి'అన్నాను మృదువుగా. నమ్మలేనట్టు చూసింది. దుప్పటిలేని ఆమె చెయ్యి కడుపు మీదకివెళ్ళింది. తరువాత బాధతో పెదాలు బిగపట్టి ....'మీరు...మీరెక్కడనించి వచ్చారు, మా ఫ్రెండ్స్..." 'అంతా వున్నారు. మీరు అట్టే మాటాడకండి- కదలకుండా పడుకోండి వాళ్ళు యిప్పటివరకు యిక్కడే వున్నారు. ఇప్పుడే రూముకెళ్ళారు. మీరింక మాట్లాడకండి రెస్టు తీవుకోవాలి-' అంటూ నేనిక్కడహౌస్‌సర్జన్‌ని. మీకేం పరవాలేదు. నేను వచ్చి మధ్య మధ్య చూస్తుంటాను -' అని కోరకుండానే అభయం యిచ్చి ఆమె మళ్ళీ కాస్త మగతలోకి జారగానే బయటికివచ్చాను. పగలు డ్యూటీ నాది కాక

పోయినా రెండు గంటల కొకసారి వచ్చి చూసేవాడిని, నా శ్రద్ధా శక్తులని ఆశ్చర్యంగా చూస్తున్న నర్సులకు. తోటి కొలీగ్స్‌కి నా ఫ్రెండు చెల్లెలు అంటూ చిన్న అబద్ధం చెప్పాను. రజియాపట్ల నా కుతూహలం, ఆసక్తికి నాకే అర్థం తెలియదు.

ఆస్పత్రిలో రజియావున్న పదిరోజులు నాకు పది నిమిషాలలాగ గడిచాయి. ఆమె అక్కడ అలా దేవకన్యలా బెడ్‌మీద పడుకుంటే హాస్పిటల్‌కే అందం, చైతన్యం వచ్చినట్లు అన్పించేది. ఆ పది రోజులలో రజియా సిగ్గు, బెరుకు పోగొట్టుకుని నాతో చనువుగా మాట్లాడింది. ముందురోజు బాధలో వున్నా తరువాత తరువాత కాస్త తేరుకున్నాక నాపట్ల కుతూహలం కనపరుస్తుందని నా కనిపించేది. ఆమె స్నేహితురాళ్ళిద్దరూ ఆమెని తెగ హాస్యాలు చేసి ఏడిపిస్తూ ఆట పట్టించేవారు. ముందురోజు నేను యింటికెళ్ళి కాల వ్యవధి తీర్చుకొని మళ్ళీ వచ్చేసరికి ఆమె స్నేహితురాళ్ళిద్దరూ' ఇదేమిటే నీ రాజకుమారు డిక్కడ ప్రత్యక్ష మయ్యాడు హఠాత్తుగా.

"చెలీ నీ మనోభీష్టం నెరవేర్చుటకు ఆ దేముడే మిమ్ములనిట్లు కలిపి యుండనో మో," అంటూ హాస్యం ఆడుతున్నారు. రజియా కోపం నటిస్తూ" నోరు మూసుకోండి లేకపోతే దవడ వాయిస్తాను" అంది.

"పాపం...నిన్నరాత్రి నీ రాకుమారిడి మొహం చూడవే, ఏం గాభరా పడిపోయాడు, యిటు పరుగెత్తి. అటు పరుగెత్తి ఫోన్లు చేసి తెగ హడావిడి పడిపోయాడు. పాపం ఏద్పొక్కడే కరువాయి అనుకో. ప్రతి పేషెంటు మీద యింత దయ, ఎటెన్‌షన్ చూపిస్తే యీ ధర్మాసుపత్రులలో ధర్మం అనేది గగన కుసుమం అవక పోయేది కాదా,

"బాగుందే నెచ్చెలీ నీమాట. అందరూ మన రజియా అంత అందగత్తెలే అయివుంటే డాక్టర్లందరూ పెరుగులెత్తి పందాలు వేసుకుని సేవలు చేయగ రారా.

"అయితే, యీ చిన్నదాని అందానికి ఆ సుందరాంగుడు బోర్లా పడ్డాడంటావు ?

"ఆహా - కావలిస్తే ముందు పళ్ళు రెండు విరగ గొట్టుకున్నాడో లేదో చూడు.

"అబ్బబ్బ-ఏమిటే యీ గోల అర్థం పర్థం లేకుండా యీ వాగుడేమిటి, పోండిక్కడనించి."

"పోతాం, నీ రాకుమారుడు డ్యూటీలో ప్రవేశించనీ....". ఇంకా పక్కన నిలబడి వినడం సభ్యత కాదని లోపలికి ప్రవేశించాను.

"ఏమిటి, మీ స్నేహితురాలిని పాపం ఇబ్బంది పెడుతున్నారు" అన్నాను. వాళ్ళమాటలు నేను విన్నానని గుర్తించగానే ముగ్గురు సిగ్గుతో తలలు దించుకున్నారు, రజియా అయిత కళ్ళు తెరవలేనట్టు మూసుకొని ఉండిపోయింది.

"ఏంలేదు...నిన్నరాత్రి మీరు పాపం చాలా శ్రమపడ్డారని మీరుండబట్టి రజియాకు అంత తొందరగా వైద్యసదుపాయం తేలిగ్గా దొరికిందని చెపుతున్నాను" అంది రమ నవ్వుతూ.

"కష్టపడ్డానని ఒప్పుకున్నారుగదా-మరి నా కష్టానికి బహుమతి ఏమి ఇవ్వదా మీ స్నేహితురాలు...." కొంటెగా అడిగాను.

"ఎడ్వాన్సు ముందే ఇచ్చేసిందిగా_" శకుంతల చిలిపిగా అంది. ఆశ్చర్యంగా చూస్తూ "ఏమిటది?" అన్నాను.

"అదే....అదే...లబ్-డబ్....లబ్-డబ్....అని కొట్టుకుంటుంది చూడండి ... దానిపేరు మీ భాషలో గుండెకాయా-హృదయమా-మనసా....బాబోయ్",రజియా రమ చెయ్యిమీద ఒక్కగిల్లు గిల్లింది. కెవ్వుమంది రమ. రజియా సిగ్గుతో కోపంతో ఎర్రబడిపోయింది. వాళ్ళ చిలిపి మాటలు ఇంకా ఇంకా వినాలని వున్నా బొత్తిగా పాపం రజియాని అలా ఇబ్బంది పెట్టడం బాగులేదనిపించింది. అందుకే టెంపరేచర్ ఛార్ట్‌కేసి చదువుతున్నట్టునటించాను. రమ, శకుంతల కొంటెగా నవ్వుతూలేచి "రజియా కాలేజి ఒకటి ఏడ్చింది మా ప్రాణానికి. సాయంత్రం మళ్ళీ వస్తాం. అయినా మేం లేని లోటు రాకుండా చూసుకుంటారులే డాక్టరుగారు సాయంత్రం వరకు ఆయన కేరాఫ్ ఎడ్రసులో వుండు-మేం వెడుతూ మీ అమ్మగారికో టెలిగ్రాం కొడతాం. బైదిబై డాక్టరుగారు మేం బీదవాళ్ళం-రజియా ఇవ్వాల్సిన ఫీజుకింద ఆమె ఏం ముట్టచెపుతుందో-మీరేం పుచ్చుకుంటారో అది మీ ఇద్దరే చూసుకోండి-వస్తాం. టా-టా" అంటూ తుర్రుమన్నారు.

"బలేవాళ్ళే మీ స్నేహితురాళ్ళు-చాలా అల్లరి చేస్తారనుకుంటాను-మిమ్మల్ని తెగ ఆటపట్టించి ఏడిపిస్తున్నారు...." రజియా సిగ్గుగా తల ఆడించింది.

"ఎలావుంది నొప్పికాస్త తగ్గిందా-" మృదువుగా అడిగాను.

"బాగానొప్పిగావుంది ఇంకా-కాళ్ళువూరికే లాగుతున్నాయి-"అంది నీర్సంగా.

"ఈరోజు కాస్త అలాగే వుంటుంది మరి–" అన్నాను సానుభూతిగా. మీ అమ్మగారు నాన్నగారు వస్తారేమో లెండి రేపటికి–" ఏదో ఒకటి మాట్లాడాలని మాట్లాడుతూ.

"అమ్మకి కబురు తెలియగానే వసుంది నాన్నలేరు."

"అలాగా, అసలు ఏవూరు మీది–" అంటూ మాటల్లో వాళ్ళ కుటుంబ వివరాలు లాగాను–రజియా తండ్రి చాలారోజుల క్రితమే పోయాడు. వాళ్ళది వున్న సంసారం గాదు. రజియా అన్న ఒకడున్నాడుగాని పెళ్ళి చేసుకున్నాక భార్య మాటలకి లోబడి తల్లిని. సోదరిని చచ్చారో బతికారోకూడా కనుక్కోడం మానేశాడు. రజియా తల్లి పాపం ఆ వున్నయింట్లో సగం అద్దెకిచ్చి నలుగురు పిల్లలకి చదువు చెపుతూ అతి కష్టంమీద రజియాని చదివిస్తుంది. రజియా ఈ ఏడాది కాంగానే ఏదో ఉద్యోగంచేసి తల్లిని ఆదుకోవాలని ఆరాట పడుతుంది. కాని రజియాతల్లి ఏదన్నా సంబంధంచూసి పెళ్ళిచేసి తన బాధ్యత తీర్చేసుకోవాలని ఆరాట పడుతుంది. రజియాకి అందంతప్ప ఐశ్వర్యంలేదు. ఆ సౌందర్యమే సమస్త భూషణాల పెట్టు. రజియా అపురూప సౌందర్యానికి ఆకరితులై యిద్దరు ముగ్గురు రజియాను పెళ్ళాడతామన్నారు, కాని చదువు సంధ్యలేని ఆ రౌడీలని రజియా యిష్టపడలేదు.

ఈ వివరాలన్నీ మాటల్లో రజియా ద్వారా కొంత, ఆమె తల్లి రాగానే నేను చేసిన సాయం కూతురి ద్వారా విని చాలా సంతోషపడ్తూ – దీవిస్తూ అమాయకంగా తన కష్టం సుఖం నాతో చెప్పుకున్న మాటల ద్వారా కొంత తెలుసుకున్నాను. రజియా మీద నేను చూపిన శ్రద్ధాసక్తులకి ఆమె పదే పదే కృతజ్ఞతలు చెప్పేది. కన్నకొడుకు కన్నా మిన్నగా సహాయం చేస్తున్నందుకు పొంగి పోయింది.

మొత్తానికి రజియా ఆస్పత్రిలో వున్న ఆ పన్నెండు రోజులు రజియాతో నా పరిచయం మైత్రిగా, ఏదో తెలియని అనుబంధంగా మారిపోయింది. ఒంటరిగా కూర్చున్నప్పుడు రజియా పట్ల యీ ఆకర్షణ నాకెందుకు అని పదేపదే ప్రశ్నించుకునేవాడిని. రజియా అందగత్తె, ఆమె సౌందర్యానికి ఆకర్షితుడయ్యాను. కాని, రజియా అందం స్వంతం ఎలా చేసుకోగలను. రజియాకి నాకు మధ్య జాతి, మతం, గౌరవం వగైరా అడ్డంకులు చాలా వున్నాయి. అవన్నీ అధిగమించే ధైర్య సాహసాలు నాలో వున్నాయా! వంశ గౌరవానికి, పరువు ప్రతిష్టలకి ప్రాణంపెట్టే తల్లి –అన్నయ్య రజియాని మాయింటి కోడలుగా ప్రాణం పోయినా అంగీకరించరు.